క్లుప్తంగా

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లిన తన కూతురు తిరిగి ఇంటికి రాలేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో గ్రామస్తులు

రాజాం: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని వ్యతిరేకిస్తూ మండలంలోని కంచరాం గ్రామంలో గ్రామస్తులు ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నిర్మూలించాలని, ముష్కరుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని యువత నినాదాలు చేశారు. అనంతరం పర్యాటకుల మృతికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శరవేగంగా తాగునీటి పైపులైన్ మరమ్మతులు



పైపులైన్ బాగు చేస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామంలో పాడైన తాగునీటి పైపులైన్ మరమ్మతులు ఆదివారం శరవేగంగా చేపట్టారు. సర్పంచ్ మూడడ్ల పార్వతి ఆధ్వర్యంలో ఈ పైపులైన్ బాగు చేసే పనులు కొనసాగాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

మోక్షప్రదాయిని భగవద్గీత

రేగిడి: భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీత చదివితే చెడుగీతలు చెరిగి మోక్షం పొందవచ్చని ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. మండలంలోని దేవుదల గ్రామంలోని గీతా మందిరంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజులో ఎంతో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. భగవంతుని నామస్మరణ ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో గొర్లె దామోదరరావు, మోహన్‌దాస్, అప్పలరాం, నిత్యస్మరనానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

తెర్లాం: పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు అని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బొబ్బిలి: మే డేకు సంబంధించి, వాల్‌పోస్టర్‌ను స్థానిక పట్టణంలోని కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్మికుల హక్కులు సక్రమంగా అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు రైల్వే సీనియర్ జనరల్ మేనేజర్ ఆర్‌వీఎస్ రాఘవరావు, పీకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితి సత్యం తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో మట్టి నమూనాల సేకరణ ఆదివారం చేపట్టారు. ప్రతి రైతు తమ పొలాల్లో మట్టి సేకరణ చేసి పరీక్షించాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. నేలసారానికి అనువైన పంటలు వేసుకుంటే దిగుబడులు బాగా వస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పైల తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరాహార దీక్షలు

శృంగవరపుకోట: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు ఆర్టీసీ డిపోల్లో నిరాహార దీక్షలు చేయనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కార్యదర్శి ఓ.రాజయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భద్రత, అక్రమ సస్పెన్షన్ల రద్దు, ప్రమోషన్స్ పునరుద్ధరణ, పాతవైద్య విధానం పునరుద్ధరణ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.



రాజాం మండలం, జీఎన్‌వలసలో చుక్కనీరు లేని చెరువు

జలకళ.. వెలవెల!

- ఎండిపోతున్న పల్లె చెరువులు
- పశుపక్ష్యాదులకు తాగునీటి కొరత
- వ్యవసాయానికీ అందని సాగునీరు
- ఆక్రమణలతో తగ్గిన నీటివనరుల విస్తీర్ణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజాం:

చెరువుల్లో జలకళ తప్పింది. నాడు నిండుకుండల్లా దర్శనమిచ్చిన చెరువులు నేడు వెలవెలబోతున్నాయి. రోజురోజుకూ చెరువుల్లోని నీరు ఎండిపోతోంది. ప్రస్తుత వేసవి ఎండలకు ఏ చెరువులో చూసినా చుక్కనీరు కనిపించడం లేదు. దీంతో సాగునీటికి, పశువుల దాహార్తి, స్నానానికి ఇబ్బందులు నెలకొంటున్నాయి. పశువులను పొలాలకు మేతకు తీసుకువెళ్లే వారు ఆ మధ్యలో కనిపించే చెరువుల్లో నీటిని పశువులతో తాగించి, వాటి దాహం తీర్చేవారు. అలాగే మేత పూర్తయిన తర్వాత ఇంటికి బయలుదేరే సమయంలో అదే చెరువుల్లో మూగజీవాలకు స్నానం చేయించి, వేసవితాపం నుంచి ఉపశమనం కలిగించేవారు. ఇప్పుడు చాలా చోట్ల చెరువులు నీరు లేకుండా ఉండడం చూసి, ఇప్పుడే ఇలా ఉంటే ముున్ముందు ముదిరే వేసవిలో పరిస్థితి ఇంకెలా ఉంటుందని, భూగర్భజలాలు కూడా ఇంకిపోయే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రైతులు చెరువులు ఇలా ఎండిపోయి ఉంటే తమ పంటలకు సాగునీరు ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలతో చెరువులు కనుమరుగు..

రాజాం నియోజకవర్గంలో మొత్తం 283 సాగునీటి చెరువులు ఉన్నాయి. ఆక్రమణదారులు వీటిని ఆక్రమించుకుంటుండడంతో చెరువులు రానురాను కనుమరుగవుతున్నాయి. ఆక్రమించుకున్న చెరువు భాగాన్ని గ్రావెల్‌తో నింపి పొలాలు తయారు చేస్తున్నారు. ఫలితంగా చెరువుల విస్తీర్ణం తగ్గిపోయి తద్వారా వాటిల్లో నిల్వ ఉండాల్సిన నీరు ఉండడం లేదు. ఎక్కడికక్కడ ఇలా ఆక్రమణలు ఎక్కువవడంతో బక్కచిక్కిపోయినట్లుగా చెరువులు కనిపిస్తున్నాయి. తక్కువ స్థలంలో ఉన్న చెరువులో వర్షాకాలంలో వచ్చే వర్షపునీరు కూడా నిలవడం లేదు. ఫలితంగా వేసవి ప్రారంభంలోనే చెరువులు ఇంకిపోతున్నాయి.



రేగిడి మండలం, లింగాలవలస దగ్గరలో ఎండిపోయిన చెరువు



రాజాం మండలం, ఇల్లంనాయుడువలసలో ఇంకిపోయిన సాగునీటి చెరువు

చర్యలు శూన్యం..

సాగునీటి చెరువులు ఆక్రమణకు గురవుతుంటే వాటిని అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణదారులు తమ ఇష్టారాజ్యంగా చెరువుల గర్భాలను ఆక్రమించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు సైతం ఆక్రమణలు గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఆయకట్టు రైతులు ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. రాజాం, సంతకవిటి మండలాల్లోని చెరువుల్లో ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. గ్రావెల్‌తో చెరువుల లోతును సమతలం చేసేస్తూ పొలాల విస్తీర్ణంలో కలిపేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చుక్కనీరు లేదు..

మా గ్రామంలోని సాగునీటి చెరువులో ఎప్పుడూ నీరు ఉండేది. మండువేసవిలోనూ ఎంతో కొంత నీటినిల్వలు కనిపించేవి. చెరువుల ఆక్రమణ కారణంగా ప్రస్తుతం ఒక్కచుక్క నీరు లేదు. చెరువుల సంరక్షణకు అధికారులు పాటుపడాలి. -ఆర్.వెంకటరమణ, రైతు, లింగాలవలస, రేగిడి మండలం

చెరువుల విస్తీర్ణం తగ్గింది..

మా గ్రామంలోని సాగునీటి చెరువులు గతంలో చాలా విశాలంగా ఉండేవి. ప్రస్తుతం వాటి విస్తీర్ణం క్రమక్రమంగా తగ్గిపోతోంది. ఫలితంగా వేసవి వచ్చేసరికి చెరువులు ఇంకిపోతున్నాయి. పశువుల స్నానానికి కూడా నీరు ఉండడం లేదు. -బి.రామచంద్రుడు, రైతు, సోపేరు, రాజాం మండలం

వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులకు పదును పెట్టడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కె.మోహనరావు కోరారు. స్థానిక పట్టణంలోని వాసు జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. అక్కడికి వచ్చే విద్యార్థులకు నేర్పిస్తున్న శిక్షణాంశాలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఆటపాటలతో కూడిన విద్య, విజ్ఞానం అందించాలని, అలాగే నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వివిధ అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా ఉపవిద్యాశాఖాధికారి మోహనరావు

యోగాసనాలపై శిక్షణ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్వేతాచలపతి పాఠశాలలో విద్యార్థులకు యోగాసనాలపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. యోగా గురువు జామి భాస్కరరావు పలు ఆసనాలు వేసి, వాటి ప్రయోజనాలు వివరించారు. ప్రతిరోజూ యోగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయని తెలిపారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు అందిస్తున్న వృత్యంతర శిక్షణను ఉపవిద్యాశాఖాధికారి కె.మోహనరావు ఆదివారం తనిఖీ చేశారు. డెల్టా సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణలో టీచర్లకు నేర్పిస్తున్న అంశాలపై ఆరా తీశారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ చోడిగంజి రవి, నిర్వాహకులు మింది విజయమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

బొబ్బిలి: స్థానిక మహరాణిపేట సెయింట్ ఆంధ్రూస్ లూథరన్ చర్చిలో మహిళలను ఆదివారం సన్మానించారు. ఈస్టర్ తర్వాతి ఆదివారాన్ని ఏటా స్త్రీల ఆదివారంగా పరిగణించి, స్త్రీలను ఇలా గౌరవించడం ఆనవాయితీగా వస్తోంది. స్త్రీ ఆధారంగానే మంచి కుటుంబం మనుగడ ఉంటుందని, ప్రతిఒక్కరూ మంచి నడవడికతో మెలగాలని వక్తలు కోరారు.

విరాళాల సేకరణ

బొబ్బిలి: పోలియో నిర్మూలనకు స్థానిక పట్టణంలో రోటరీ క్లబ్ సభ్యులు ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. విరాళాల ద్వారా సేకరిస్తున్న సొమ్మును పోలియో నిర్మూలన కార్యక్రమాలకు వినియోగిస్తామని క్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు తెలిపారు.

ఎట్టకేలకు కల్వర్టు బాగుచేశారు..



నాడు శిథిలమైన కల్వర్టు



నేడు బాగు చేసిన కల్వర్టు

సాక్షి ఎఫెక్ట్...

తెర్లాం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మరమ్మతులకు గురైన కల్వర్టును ఎట్టకేలకు బాగుచేశారు. ఇదివరకు శిథిలమైన ఇక్కడి కల్వర్టుతో కాలనీవాసులు పడుతున్న నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన సాక్షి దినపత్రికలో 'కల్వర్టు బాగుచేయరూ?' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు స్పందించి, పాడైన కల్వర్టును బాగు చేయించారు. ప్రస్తుతం కల్వర్టు బాగుపడడంతో వాహనాల రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి.

బీమాతో ఉపాధి వేతనదారులకు ధీమా

- పీఎం సురక్ష, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాల కింద బీమా సదుపాయం
- పీఎం సురక్ష యోజన పథకానికి ఏడాదికి చెల్లించాల్సిన ప్రీమియం రూ.20
- పీఎం జీవన్‌జ్యోతియోజన పథకానికి ఏడాదికి చెల్లించాల్సిన ప్రీమియం రూ.436
- వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగించిన అధికారులు
- జిల్లాలో 5.63 లక్షల మందికి వర్తించనున్న బీమా

మెరకముడిదాం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోంది. ప్రమాదాల్లో వేతనదారులు దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం సంభవించినా బీమా రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను అమలు చేస్తోంది. అయితే ఈ పథకాలు ఉన్న సంగతి చాలా మంది వేతనదారులకు తెలియక పోవడంతో వారి కుటుంబాలు నష్టపోతున్నాయి. ఈ పథకాల ద్వారా జాబ్‌కార్డు ఉన్న వేతనదారులందరికీ బీమా చేయించాలని తాజాగా పంచాయ తీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల కమిషనర్‌లను ప్రభుత్వం ఆదేశించింది. వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించే బాధ్యతను ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు సంబంధిత శాఖల అధికారులు అప్పగించారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ అందజేసే దరఖాస్తుపై వేతనదారులు సంతకం చేసి తిరిగి వారికి అప్పగిస్తే మిగతా ప్రక్రియ అంతా వారే చూసుకుంటారని, వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకుంటారని అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో ఉపాధి పనులకు హాజరవుతున్న 5.63 లక్షల మంది వేతనదారులంతా బీమా పథకానికి అర్హులే.



గొల్లలవలసలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

రెండు రకాలుగా బీమా సదుపాయం

ఉపాధి వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్ష, పీఎం జీవన్ జ్యోతి యోజన పథకాల కింద రెండు రకాల బీమా సదుపాయం కల్పిస్తోంది. పీఎం సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వేతనదారులు ప్రతీ సంవత్సరం రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో ప్రీమియం చేయించుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తి వైకల్యం కలిగినా రూ.2 లక్షల పరిహారం అందుతుంది. పాక్షికంగా వైకల్యం సంభవిస్తే లక్ష రూపాయల సహాయం అందుతుంది. పీఎం జీవన జ్యోతి యోజన పథకం కింద బీమా పొందేందుకు 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు మరణించినా, సహజమరణం పొందినా రూ.2 లక్షలు అందుతుంది. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులంతా ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లను సంప్రదించి త్వరగా ప్రీమియం చెల్లించాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డులు, వేతనదారుల వివరాలు	
మొత్తం జాబ్‌కార్డులు:	3,85,000
యాక్టివ్‌లో ఉన్నవి:	3,43,000
వేతనదారుల సంఖ్య:	6,86,000
యాక్టివ్‌లో ఉన్న వారి సంఖ్య :	5,63,000
ప్రస్తుతం పనులకు హాజరవుతున్న వేతనదారులు:	2,10,000

బీమా చేయించుకోవాలి

జాబ్ కార్డు ఉన్న ఉపాధి వేతదారులు అంతా పీఎం సురక్ష, పీఎం జీవన్ జ్యోతి యోజన పథకాల్లో ఏదో ఒక పథకం కింద బీమా చేయించుకోవాలి. ఉపాధి సిబ్బంది ఇచ్చే దరఖాస్తులపై వేతనదారులు సంతకాలు చేసి ఇస్తే వేతనదారులకు ఖాతా ఉన్న బ్యాంకులో వాటిని సమర్పిస్తాం. వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. బీమా కోసం ఎవరికి నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు. – రమామణి, ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జ్ ఏపీడీ, రాజాం క్లస్టర్

అట్టడుగు వర్గాల జీవనమే 'నెమ్మి నీలం కథలు'



మాట్లాడుతున్న సాహితీవేత్త శ్రీనివాసరావు

రాజాం సిటీ: తమిళనాడులోని నాడార్లు, నాయాడులు వంటి అట్టడుగు వర్గాల ప్రజల జీవనాన్ని, వారిపై అగ్రవర్ణాలు చూపిన వివక్షను చిత్రించినదే నెమ్మి నీలం కథలని సాహితీవేత్త పాదిలాపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక(రారవే) 123వ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన..'నెమ్మి నీలం కథలు-ఒక పరిశీలన' అనే అంశంపై ప్రసంగించారు. 150 ఏళ్ల క్రితం గీత కార్మికులైన నాడార్లు, అంతకన్నా ఇంకా అడుగున ఉన్న నాయాడుల జీవన సరళి, చారిత్రక నేపథ్యం, సమాజంలో వారి స్థాయి వివరించే కథలు ఇందులో ఉన్నాయన్నారు. ఈ కథల్లో మానవత్వం, ఆకలి, నల్లరంగు అనే మూడు అంశాలు ముఖ్య భూమిక పోషించాయన్నారు. నాడార్ల ప్రగతికి కాంగ్రెస్ పార్టీ, క్రిస్టియానిటీ సంస్థలు కృషి చేశాయన్నారు. కార్యక్రమంలో రారవే నిర్వాహకుడు గార రంగనాథం, మూడడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యమివ్వాలి

బొబ్బిలిరూరల్: సమాజ శ్రేయస్సుకు అందరూ ప్రాధాన్యమివ్వాలని డీఎస్పీ జి.భవ్య రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సంకల్ప వేదిక జిల్లా కమిటీ నియామక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఆ ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పోలీసుల కు సూచించారు. అనంతరం డీఎస్పీని సన్మానించా రు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయవాది మదిరే రంగసాయి రెడ్డి, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్దవోలులో గ్రామదేవత పండగ

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న గ్రామదేవత పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఉత్సవ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ పండగ సందర్భంగా గతకొన్ని రోజులుగా అమ్మవారి ఘటాలు, పాలజంగిడిని గ్రామంలో ఊరేగించారు. సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపు పండగ జరపనున్నట్లు తెలిపారు. పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హేమంత్‌కుమార్ హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 2004–2009 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో పాఠశాలలో పండగ సందడి నెలకొంది. చాలా ఏళ్ల తర్వాత కలవడంతో ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని, ఆనందంగా గడిపారు. ఆనాటి గురువులు నర్శింగరావు, ప్రసాదరావు, సూర్యనారాయణ రామచంద్రరావులను సన్మానించారు.

ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ హెల్త్ యూనిట్



రామభద్రపురం పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఆవరణలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. కొన్ని నెలల క్రితం రూ.లక్షలు వెచ్చించి పూర్తి చేసిన ఈ నిర్మాణం అందుబాటులోకి రాకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇదే భవనంలో ఐసోలేషన్ వార్డు కూడా ఉండడంతో త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

–రామభద్రపురం

ఆస్పత్రి వరండాలోనే వైద్యం



బాడంగి సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)లో వైద్యం దయనీయంగా మారింది. రోజురోజుకూ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువవుతోంది కానీ అక్కడ అందే సేవలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. వైద్యుల కొరత ఉండడంతో పాటు ఆస్పత్రిలో రోగులకు సరిపడ బెడ్లు(మంచాలు) లేకపోవడంతో వరండాలోనే వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రిపూట దోమలు విపరీతంగా కుడుతున్నాయని, ఒక రోగంతో వస్తే మరో రోగం అంటుకునేలా ఉందని రోగులు వాపోతున్నారు. నిర్మాణ దశలోని ఆస్పత్రి కొత్త భవనం త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

–బాడంగి

ఉగ్రదాడిపై నిరసన



కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై బొబ్బిలిలోని మన కుటుంబం, సమరసతా సేవా ఫౌండేషన్, హనుమాన్ సేవా సంస్థల సభ్యులు ఆదివారం నిరసన చేపట్టారు. ఓ వైపు నల్లజెండాలు చేతపట్టి, మరోవైపు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని ముష్కరుల దాడిని ఖండించారు. ఉగ్రమూకలు చేసిన ఈ అమానవీయ ఘటనను అందరూ వ్యతిరేకించాలన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు ప్రపంచ దేశాలు ముందుకురావాలని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం మృతులకు నివాళులర్పించి, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎన్నాబాబు, రవి, వాసు, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

–బొబ్బిలి

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

వేపాడ: మండలంలోని చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్‌ల లేఅవుట్‌లు,ఇతర అవసరాలకు ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తవ్వేస్తున్నారు. సోంపురం గ్రామంలోని పెద్దచెరువు, అరిగిపాలెం గ్రామంలోని ఊరచెరువు, దబ్బిరాజుపేటలో నాయుడు చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జేసీబీతో తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు.